

# ఎర్రగులాబీ

**మణిభూషణ్**

**ఆ రోజు ఆఫీసు నుంచి రాగానే ప్రసాద్ ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ మూర్ఛపోయినంత పనిచేశాడు.**

డ్రాయింగ్ రూమ్‌లో, కిటికీ దగ్గరగా స్టూలు మీద అందమైన పూలకుండీలో, ఒద్దికగా పెంచబడ్డ గులాబీ మొక్క... దానికో పువ్వు. ఎర్రగా, అందంగా సౌరభాలు చిలుకుతూ, మత్తెక్కిస్తూ, ఒయ్యారాలు పోతూ, విలాసంగా గాలికి అటూఇటూ కదులుతూన్న పెద్ద అందమైన గులాబీ!

"రేణూ!... రేణూ!!..." గట్టిగా పిలిచాడు ప్రసాద్.

ఆ పిలుపులోని ఆనందాన్ని పసిగట్టలేనిది కాదు రేణుక. అసలు అతనిని అటువంటి సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాలనే తను కొన్న గులాబీ మొక్కను అతని కంటపడకుండా జాగ్రత్తగా పెంచుకుంటూ వచ్చింది. గులాబీలు అంటే అతనికి ఎంత మక్కువో ఆమెకు తెలియంది కాదు. బజారుకు పూలకని వెళితే గులాబీలు తప్ప ఇంకేమీ తేడు అతను. 'రేకులు రాలిపోతూ ఎప్పుడూ ఆ గులాబీలు తీసుకురాకపోతే ఏ మల్లెలో, జాజులో తీసుకు రాకూడదా?' అంటూ తను ఎంత నసపెట్టినా ఈ రోజుకు కూడా అతను మారలేదు. అటువంటిది, అతను ఆ రోజు అలా ఆఫీసునుంచి వచ్చి డ్రాయింగ్ రూమ్‌లోకి అడుగు పెట్టగానే తనను ఎందుకలా ఆత్రంగా ఆనందంగా పిలుస్తున్నాడో ఊహించలేకుండా ఎలావుంటుంది రేణుక. స్టవ్ వెలిగించి కాఫీ స్టవ్ మీద పెట్టి, చేతులు కొంగుతో తుడుచుకుంటూ "ఏంటండీ ఆ కేకలు??" అంటూ బయటికి వచ్చింది.

"ఎక్కడ సంపాదించావోయ్ ఈ మొక్క?..."

ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు ప్రసాద్. భార్య చెప్పేది వినడం ఆలస్యం, ఆమెను ప్రశంసలతో ముంచెత్తాడు. భార్య తన యిష్టాయిష్టాలకు అంత ప్రత్యేకమయిన స్థానం ఇస్తుందన్న విషయం అతని మైమరపును ఇకొంచెం ఎక్కువ చేసింది.

కుర్చీలో కూర్చుని వెనక్కి జార్లబడి ఆ పూవ్వు కేసి చూస్తూ భార్య తెచ్చిన కాఫీ తాగుతూ స్వర్గంలో వున్నంత హాయిగా ఫీలవసాగాడు. అర్ధనిమీలిత నేత్రాలతో ఆ అలౌకికమైన ఆనందంలో చాలాసేపు అలా తలమునకలయ్యాడు.

*** *** ***

ఆ హడావిడి అంతా గమనిస్తూనే వుంది గులాబీ జాణ...

"ఓహోయ్!!" అంటూ గర్వంగా కిటికీలోంచి తోటలోకి తొంగిచూస్తూ మిగిలిన పూలను పలకరించింది. సాయంత్రం ఆ గదిలోకి వచ్చినప్పటి నుండి తను 'ఓ ప్రత్యేకమయిన సృష్టిని' అనుకుంటూ గర్వంగా మెలికలుపోతూనే వుంది గులాబీ.

*** *** ***

మర్నాడు ప్రసాద్ ఆ గులాబీ ముందే కూర్చుని తన్మయత్వం చెందుతూ కాఫీ తాగాడు. ఆ మొక్క నిండా మొగ్గలే. ఒకదాని తర్వాత ఒకటి విచ్చుకుంటూనే వున్నాయి.

*** *** ***

ఆ తర్వాత రోజు ఆఫీసు నుంచి రావడమే లేటయింది అతనికి. వచ్చాక కూడా తలలో ఆఫీసు విషయాలే. రావడమే, పడక గదిలోకి పోయి మంచం మీద పడుకుండిపోయాడు.

గులాబీ మామూలుగానే ఎర్రగా అందంగా వుంది. వెన్నెలతో వూసులు చెప్తూ వుండుండి ప్రసాద్ పడక గదికేసి ఓరగా చూస్తూ, ఒయ్యారాలు పోతూ, విలాసాలు చిమ్ముతూ హాయిగా అందంగా వుంది గులాబీ ఆ రోజూనూ.

*** *** ***

తర్వాత రోజు...

ప్రసాద్ ఆఫీసు నుంచి ఓపికలేని వాడల్లే వచ్చాడు. రాగానే కుర్చీలో కూర్చుండిపోయాడు నీరసంగా... కాళ్ళు ఎదురుగా వున్న టీపాయ్ మీద పెట్టి వెనక్కు జార్లబడి కళ్ళు మూసుకున్నాడు అలసటగా.

"రేణూ! కాఫీ!!"...

కాఫీ తాగి కాస్త శక్తి వచ్చిన వాడల్లా లేచివెళ్ళి మొహం కడుక్కుని వచ్చాడు. కుర్చీలో కూర్చుని వెనక్కి జార్లబడి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

రేణుక వంటయింట్లో వంట చేస్తోంది.

ప్రసాద్ చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు.

వుండుండీ కళ్ళు తెరుస్తున్నాడు. తెరిచినపుడల్లా ఎరుపు తెర ఏదో కళ్ళముందు కదిలినట్లవడం... తన ఆలోచనలు తెగిపడడం... మళ్ళీ కళ్ళు మూసుకోవడం... మళ్ళీ తెరవడం... అదే ఎరుపు తెర కెరటంలా కళ్ళముందు కదలడం... అలసటగా వున్న ప్రసాద్‌కు అసహనంగా అనిపించింది. ఈసారి అతను కళ్ళు మూసుకోకుండా తదేకంగా చూడసాగాడు. తనను అలా డిస్ట్రాక్ట్ చేస్తున్న నేరస్తుణ్ణి పట్టుకోవాలన్న పట్టుదల అతని కళ్ళలో స్పష్టమవుతోంది.

ఎదురుగా అలవోకగా గాలికి కదులుతూ ఎర్రగా గులాబీ... మామూలుగానే అందంగా వుంది. పెద్దగా వుంది. సువాసనలు చిమ్ముతూంది ఆ గులాబీ.

"ఒస్ యిదా" అనుకుంటూ మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. ఆలోచిస్తూనే కళ్ళు తెరిచేసరికి మళ్ళీ ఎర్రగా తెర కళ్ళముందు... ఒక్కసారిగా చెప్పలేనంత కోపం ముంచుకువచ్చింది అతనికి.

"రేణూ... రేణూ!! ఇలారా"

ప్రసాద్ అరుపులకు హడావిడిగా బయటకు వచ్చింది రేణుక.

"ఆ మొక్కను తీసుకువెళ్ళి బయటపడెయ్యి" కోపంగా చిరాకుగా అన్నాడు ప్రసాద్.

ఆశ్చర్యపోయింది రేణుక.

అతని మూడ్ ఎందుకో బాగాలేదని గ్రహించిన రేణుక మౌనంగా ఆ పూలకుండీని తీసుకువెళ్ళి తోటలో పెట్టి తన పని చేసుకోసాగింది.

*** *** ***

ఎర్రగా పెద్దగా గులాబీ మామూలుగా అందంగా సౌరభాలు ఒలుకుతూ వుంది.

కానీ సిగ్గుగా వుంది.

"బయటకు ఎందుకు పంపివేశారు తనను"...

తలెత్తలేక ఎత్తలేక ఎత్తుతూ పరిసరాలలోని పూలను పలకరించింది. అవి తనను చూసి నవ్వుతున్నాయేమోనని కొంచెం కించపడసాగింది.

"మళ్ళీ మాలోకి వచ్చిపడ్డావు! ఎంతకాలమయింది నిన్ను చూసి..." ఓ పెద్ద చెట్టు పలకరించింది. ఆ పలకరింపులో వాత్సల్యానికి కరిగిపోయింది గులాబీ.

తల వంచుకునివున్న గులాబీ మనసులో భావాలు చదివిన దానిలా "ఈ మనుషులు ఇంతే. ఎప్పుడు దేనికి విలువనిస్తారో తెలియదు" అన్నది.

"నాకివన్నీ ఏం తెలుసని?" మౌనంగా నిట్టూర్చింది గులాబీ. మరుక్షణంలో మళ్ళీ తలెత్తి నవ్వింది.

నిండుగా అందంగా వినయంగా నవ్వింది ఈసారి. ●